క్లుప్తంగా

స్టేట్‌యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పరమేష్



కాశిబుగ్గ : మున్నూరుకాపు స్టేట్‌యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాశిబుగ్గకు చెందిన కొరివి పరమేష్ పటేల్ నియమితులయ్యారు. మంగళవారం నగరంలోని మున్నూరుకాపు భవనంలో జరిగిన సమావేశంలో నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అందజేశారని పరమేష్ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, తదితరులకు పరమేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

ముగిసిన టెక్నికల్ పరీక్షలు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో ఈ నెల 11 నుంచి 14 వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షలకు 250 మంది విద్యార్థులకు 98 మంది హాజరయ్యారని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై తెలిపారు. హయ్యర్ పరీక్షలకు 70 మందికి 38 మంది విద్యార్థులు, టైలరింగ్ ,ఎంబ్రాయిడరీ లోయర్‌లో 66 మందికి 21 మంది, టైలరింగ్ హయ్యర్ పరీక్షలకు 33 మందికి 19 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట : హనుమకొండ జిల్లా ములుగురోడ్డులోని మైనారిటీ బాలుర గురుకులంలో ఖాళీగా ఉన్న డాటా ఎంట్రీ(అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన) పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం తెలిపారు. 18–34 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 16లోగా సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు 80749 94073 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

న్యాయం చేయండి

నయీంనగర్: తన జీవితం దినదిన గండంగా గడుస్తుందని నాకు నా భర్త నుంచి జీవనభృతి ఇప్పించాలని అంజనీదేవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడు తూ బీఆర్‌ఎస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ తనను వివాహం చేసుకొని తన బాగోగులు చూడకుండా వేధిస్తున్నాడని ఆమె ఆరోపించింది. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా తనకు వే ధింపులు తప్పడం లేదన్నారు. తనకు ప్రా ణ హాని లేకుండా కాపాడి న్యాయం చేయాలని కోరారు.

కబ్జా కానివ్వం

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలనీ శ్రీరామపార్క్‌ను అన్యాక్రాంతం కానివ్వమని శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.బాల్‌రెడ్డి, ఎస్.భిక్షపతి తెలిపారు. మంగళవారం సాక్షిలో పార్క్ స్థలంపై ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. పార్కు అభివృద్ధి కోసం తాము పాటుపడుతున్నామని కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. త్వరలోనే పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

నయీంనగర్: శారీరక వ్యాయామంతో వ్యాధులు దరిచేరవని యోగా లాంటి ఆరోగ్య సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు పిలుపునిచ్చారు. హనుమకొండ పోచమ్మకుంట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం సైక్లింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది ఉపేంద్రచారి, శరత్, అనిత, రజిత పాల్గొన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ర్యాలీ



కాజీపేట అర్బన్ : హన్మకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ములుగురోడ్డు నుంచి హనుమకొండ చౌరస్తా వరకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ర్యాలీని నిర్వహించారు. ఎన్నికల తరుణంలో లా అండ్ ఆర్డర్ విషయంలో లోకల్ పోలీస్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ చేపట్టే చర్యలను హనుమకొండ ఇన్‌చార్జ్ ఏసీపీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో హన్మకొండ ఎస్‌హెచ్‌వో, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం

కాశిబుగ్గ : భారత్ అమృత్ మహోత్సవ ఏకాత్మత యాత్ర–2023 పేరుతో ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు వరంగల్ నగర పర్యటనకు వచ్చారు. వారికి మంగళవారం సాయంత్రం వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఏబీవీపీ వరంగల్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి 30 మంది విద్యార్థులు నగరానికి చేరుకుని మూడు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తారు.

పుల్వామా అమరులకు ఘననివాళి

హసన్‌పర్తి : పుల్వామా దాడిలో అసువులు బాసిన అమర జవాన్లకు అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐఈఈఈ విభాగం ఆధ్వర్యంలో, 1వ డివిజన్ ముచ్చర్ల జాతీయ రహదారి వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, ఐఈఈఈ అ డ్వయిజర్ రాము, అధ్యాపకులు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్, చిర్ర శ్రవణ్, వెంకటేష్, దయాకర్, పాల్గొన్నారు.

హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో పుల్వామ అమరులకు ఎన్‌సీసీ కేడెట్లు నివాళులర్పించారు. ర్యాలీ తీసి, అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డాక్టర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట కాకతీయ కళాతోరణం వద్ద బీజేపీ నాయకులు ఆటో డ్రైవర్లతో కలిసి మంగళవారం సాయంత్రం నివాళులు అర్పించారు. ఈ మేరకు అమర జవాన్ల చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఎరుకుల రఘునారెడ్డి, భైరి శ్యాం, పుప్పాల శ్రీనివాస్, వసంత తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు



కాశిబుగ్గలో..

నయీంనగర్: వీర జవాన్ల స్ఫూర్తితో విద్యార్థులు భా రత మాత సేవలో పాలు పంచుకోవాలని సీడీయు విసి ఆచార్య జి.దామోదర్ కోరారు. సీడీయూ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు 1000 మంది కొవ్వత్తులతో ర్యాలీగా వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించారు. కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు మాట్లాడారు. మాజీ సైనికులు, ఆచార్య ఎం.రవీందర్, అధ్యాపకులు, మేధావులు, పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఆక్టివా స్మార్ట్ వాహనం

- శ్రీశ్రీనివాస హోండా షోరూంలో ప్రారంభం
- కీ లేకుండా ఆన్ ఆఫ్



హన్మకొండ అర్బన్: ఆక్టివా హెచ్ స్మార్ట్ వాహనంతో అతిథులు, కంపనీ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : మార్కెట్‌లోకి నూతనంగా వచ్చిన హెచ్ స్మార్ట్ వాహనాన్ని హనుమకొండ సుబేదారిలోని శ్రీ శ్రీనివాస హోండా షోరూంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీరాం ఫైనాన్స్ మేనేజర్ ఎ.ఉపేందర్ పాల్గొనగా హోండా కంపనీ ఏరియా ఇన్‌చార్జ్ సాగర్ సబ్నిస్, షోరూం ఎండీ తుమ్మల వెంకటకృష్ణారావు హెచ్ స్మార్ట్ ఆక్టీవా వాహన ప్రత్యేకతలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోండా ఆక్టివా హెచ్ స్మార్ట్ వాహనానికి ప్రత్యేకంగా ఓబీడీ 2 టెక్నాలజీలో కూడిన స్మార్ట్ లాక్ ఇవ్వబడిందన్నారు. దీంతో లాక్ లేకుండా వాహనాన్ని ఆన్ ఆఫ్ చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. ఇలాంటి టెక్నాలజీని మొదటి సారి హోండా కంపెనీనే పరిచయం చేస్తోందన్నారు. స్మార్ట్ లాక్ ద్వారా రాత్రి సమయంలో వాహనం పార్కింగ్ ప్రాంతంలో గుర్తించడం సులభంగా ఉంటుందన్నారు. వాహనానికి ఉన్న పార్కింగ్ లైట్స్ దూరం నుంచి కార్ల మాదిరిగా వెలిగించి గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. శ్రీరాం ఫైనాన్స్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, పాల్గొన్నారు.



రామన్నపేట: వాహనాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ అఫ్రిన్ సిద్దిఖీ

హీరో జూమ్ బైక్

రామన్నపేట : వరంగల్ ములుగురోడ్డులోని శ్రీశ్రీ శ్రీ హీరో షోరూమ్‌లో హీరో జూమ్ 110 సీసీ బైక్‌ను వరంగల్ ఆర్‌టీఓ అఫ్రిన్ సిద్దిఖీ మార్కెట్‌లోకి మంగళవారం విడుదల చేశారు. ఈ వాహనం సరికొత్త ఫీచర్లు కలిగి ఉండి, ఇండస్ట్రీ–ఫస్ట్ ఫీచర్– హీరో ఇంటెలిజెంట్ కార్నరింగ్ లైట్ (హెచ్‌ఐసీఎల్)తో అందుబాటులోకి వచ్చిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రూ. 72,749 తో వాహనం వినియోగదారులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో హీరో మోటోకార్ప్ టెర్రి టరీ మేనేజర్ దీపికా కుమారి, జీఎం.రమేశ్‌మూర్తి, మేనేజర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

నయీంనగర్: సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మ హారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం వేయిస్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ (గిరిజన భవన్) వరకు గోర్ బంజారాల బంజార కళానృత్యాలతో మహార్యాలీ నిర్వహిస్తున్నామని గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా అధ్యక్షుడు బాలాజీ నా యక్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గిరిజన భవన్‌లో భోగ్ భండార్ కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కేయూ క్యాంపస్ : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని బుధవారం కేయూలోని ఆడిటోరియం ఆవరణలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య తాటికొండ రమేష్ విచ్చేస్తున్నారని, రాజనీతిశాస్త్ర విభాగం రిటైర్డ్ ఆచార్యులు జి.వీరన్న కీలకోపన్యాసం చేస్తారన్నారు.

ప్రభుత్వ పార్కు స్థలాన్ని కాపాడాలి

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలని శ్రీరామ పార్క్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూసి పార్కును అభివృద్ధి చేయాలని పార్కుల సంరక్షణ సమితి అధ్యక్షుడు రతన్‌సింగ్, సభ్యులు రావుల జగదీశ్వర్ ప్రసాద్, సదానందం కోరారు. పట్టణాలకు లంగ్స్ వంటి పార్కులను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఆర్టీసీ పథకాలపై కళాకారుల ప్రదర్శన

హన్మకొండ : టీఎస్ ఆర్టీసీ అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కళాకారులు ప్రదర్శించిన కళాజాత పలువురిని ఆకట్టుకుంది. ఆర్టీసీ అందిస్తున్న సేవలు, పథకాలు వివరించడానికి ఆర్టీసీ ఉద్యోగులే కళాకారులుగా కళాబృందాన్ని ఏర్పాటు చే సింది. మంగళవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో కళా ప్రదర్శన ఇచ్చారు.

వైద్యశిబిరానికి స్పందన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీ కాలనీలోని ఏషియన్ రుమాటాలజీ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించిందని ఎం.మధుకర్‌రావు, సురేష్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన వైద్య శిబిరంలో 100 మంది పాల్గొన్నారన్నారు. సీనియర్ రుమటాలజీ డాక్టర్ వి.సునీల్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

సైన్స్ కాంగ్రెస్ పోటీలో విద్యార్థిని ప్రతిభ



హసన్‌పర్తి : మండలంలోని పెంబర్తిక్రాస్‌లోని ఏకశిల టెక్నో స్కూల్ విద్యార్థిని మన్వితారెడ్డి ప్రదర్శించిన వరిపొట్టు బూడిదతో ఎగ్జిబిట్‌కు బంగారు పతకం సాధించింది. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ముగిసిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జాతీయస్థాయి పోటీల్లో ఎం.మన్వితారెడ్డి 'వరిపొట్టు బూడిదతో నీటి శుద్ధికరణ'ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. తక్కువ ఖర్చుతో వరిపొట్టు బూడిదను ఉపయోగించిన నీటిలోని ఫ్లోరైడ్, ఆర్సెనిక్‌లకు తొలగించవచ్చనే ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. ఎగ్జిబిట్ ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి చెప్పారు.

20న ఆరె సంక్షేమ సంఘ సమావేశం

నయీంనగర్: ఈ నెల 20న హైద్రాబాద్‌లో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఉంటుందని అందులో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఎన్నిక, ఆరెకుల ఆత్మగౌరవ భవన్ భూమి పూజ తేదీలను ఖరారు చేయనున్నట్లు చెట్టుపెల్లి శివాజీ తెలిపారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపెల్లి కిషన్‌రావుకు తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

చర్యలు తీసుకోవాలి

హన్మకొండ అర్బన్ : సమాచార హక్కు చట్టం 2005ను దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని హనుమకొండ డిస్ట్రిక్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హుడుప్సా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్ధమాను జనార్దన్, పి.వెంకటరమణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈఓ అబ్దుల్ హై, ఎంఈఓ రామకృష్ణంరాజులకు వినతిపత్రాలు సమర్పించారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

కాజీపేట అర్బన్ : పేద ప్రజల సంక్షేమమే బీజేపీ ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట మండలంలోని కడిపికొండలో మంగళవారం నిర్వహించిన బీజేపీ ప్రజా గోస–బీజేపీ భరోసా పేరిట నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. మాటలు తప్ప చేతలు తెలియని సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యేలు కబ్జాలు, కమీషన్లపై దృష్టి తప్ప వివీన గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

హోంకంపోస్ట్ కార్యక్రమాన్ని చేపట్టాలి

కాజీపేట అర్బన్ : జీడబ్ల్యూఎంసీ పరిధిలోని హాస్టల్స్, అపార్ట్‌మెంట్స్, గృహసముదాయాల్లో కమ్యూనిటీ కంపోస్ట్, హోం కంపోస్ట్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యవర్గం తెలిపింది. నిట్ క్వార్టర్స్ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గం కార్యదర్శి పెండ్లి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడారు. నిట్, కేఎంసీ, కేయూసీ హాస్టల్స్, ఇతర భవనాల్లో కంపోస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మున్సిపల్ సిబ్బంది సహకారం కల్పించాలని కమిషనర్‌కు తెలిపారు.

నురుగుగా తాగునీరు

- వాసన వస్తున్నా సరఫరా చేస్తున్న అధికారులు



వరంగల్ : రెండు రోజుల నుంచి వస్తున్న నీటిని సంపులో పడుతుంటే నురుగు వస్తుందని మహిళలు ఆరోపిస్తున్నారు. పాతకాలం నాటి వాల్వ్‌లు మారుస్తున్నామని మూడు రోజులు నీటి సరఫరా బంద్ అని ప్రకటించిన కార్పొరేషన్ ఇంజనీర్లు ఆరు రోజుల పాటు మరమ్మతు చేశారు. సోమవారం నుంచి నీటి సరఫరా పునరుద్ధరించినప్పటికీ చాలాప్రాంతాల ప్రజలు రావడం లేదని ఆరోపిస్తున్నారు. 14వ డివిజన్‌లోని లక్ష్మీగణపతికాలనీ, మధురానగర్ కాలనీల్లో సరఫరా అవుతున్న తాగునీరు కంపువాసన వస్తుందని స్థానిక కార్పొరేటర్‌కు, ఏఈఈ, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైయినేజీ వాటర్ తాగునీటి పైపులో కలుస్తుందని మరమ్మతు చేయిస్తామని చెప్పడం తప్పా చేసిన దాఖలాలు లేవు. వాటర్ లైన్‌మెన్, సూపర్‌వైజర్లపై పర్యవేక్షణ కొరవడినందునే నెల రోజులుగా వాసన వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

నేడు నగరంలో మహిళలకు చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో ఈ నెల 16న జిల్లాస్థాయి మహిళల చెస్‌పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు గురువారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండ కొత్త బస్టాండ్ సమీపంలోని ఇండోర్ స్టేడియంలో హాజరుకావాలని తెలిపారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన మహిళలు 17న హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

కాశిబుగ్గ : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 16న వరంగల్ ఓసిటీ స్టేడియంలో మహిళలకు చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల ఆధికారి ఎస్. ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 16న ఉదయం 10 గంటలలోపు ఓసిటీ స్టేడియానికి రావాలని సూచించారు.

'ట్రాన్స్‌కో'లో 'కంటి వెలుగు'



హన్మకొండ : వరంగల్ ములుగు రోడ్డులోని ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ జోనల్ సీఈ శ్రీరాంకుమార్, ఓఎంసీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్, జోనల్ ఎస్ఏఈవో అశోక్, ట్రాన్స్‌కో టీఆర్‌వీకేఎస్–హెచ్ 58 రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు మాడా దేవేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. బుధవారం కూడా కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని అధికారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని దేవేందర్‌రెడ్డి కోరారు.

ఏర్పాట్లు సమీక్షించక పోవడం బాధాకరం

ఖిలావరంగల్: శంభునిగుడిలో ఈనెల 18న జరుగనున్న మహా శివరాత్రి ఏర్పాట్లు, అభివృద్ధిపై ఎమ్మెల్యే నరేందర్ సమీక్షించకపోవడం బాధాకరమని బీజేపీ వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది భక్తులకు ఆలయప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేవని, ధర్మకర్తల నియామకం ఊసేలేదన్నారు. ఇన్‌చార్జ్ ఈఓతో కాలం వెళ్లదీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యకోటలోని స్వయం భూ శ్రీశంభులింగేశ్వర స్వామిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్, నాంద్రే అమర్‌నాథ్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన శంభులింగేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం బీజేపీ నేతలు ఆలయ ఈఓ వెంకట్రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ శివరాత్రి పండుగ మూడు రోజులే మిగిలి ఉందని, ఏర్పాట్లు మాత్రం శూన్యమని ఆరోపించారు. ఆయన వెంట బీజేపీ నా యకులు చంద్రమోహన్, రాజ్‌కుమార్, శ్రీని వాస్, నరేష్, బిల్లా కిషోర్, రమేష్, రాజు, రఘు, కార్తీక్, అనిల్, రంజిత్, పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో అగ్నిప్రమాదం

- తప్పిన ముప్పు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన మంగళవారం ఒక్కసారిగా పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. మధ్యాహ్నం ఒక్కసారిగా రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రైల్వే క్వార్టర్స్ సమీపంలో చెత్తకుప్పలు, చెట్ల మధ్య పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే గ్యాంగ్‌మెన్లు, అధికారులు మంటలను చల్లార్చేందుకు ప్రయత్నించారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను చల్లార్చారు. సకాలంలో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. గుర్తుతెలియని వ్యక్తి సిగరేట్ అంటించి చెత్త కుప్పలో పడేసి ఉంటారని అధికారులు అంటున్నారు. రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత సాయికృష్ణ, రైల్వేస్టేషన్ మేనేజర్ బాలరాజు, ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు, ఇతర విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

వరంగల్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాల దత్తత తీసుకున్న కొత్తపేటలో 'వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం–డ్రోన్ల సాంకేతికత' అనే అంశంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డా.హేమశరత్ చంద్ర, వ్యవసాయాధికారి డా.బి.రాజు, వ్యవసాయాధికారి శ్రీవిజ్ఞాన్ బీఎస్సీ(అగ్రి) చివరి సంవత్సరపు విద్యార్థులు, 14 మంది గ్రామ రైతులు పాల్గొన్నారు. ప్రైవేటు సంస్థ నిపుణులు డ్రోన్ల సాంకేతికత, డ్రోన్ల సహాయంతో పంటలపై పిచికారి చేయు విధానాన్ని వివరించారు. రైతులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమధానాలు చెప్పారు. తక్కువ సమయం, తక్కువ కూలీలతో సంవృద్ధిగా మొక్కలకు తగిన పిచికారి చేసుకోవచ్చన్నారు. భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం పెరుగుతుందన్నారు. వీటిని నడిపించే వారు తప్పనిసరిగా డ్రోన్ పైలెట్ లైసెన్సులను కలిగి ఉండాలన్నారు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న రైతులు

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు మెమోరాండం అందజేస్తున్న అంబేడ్కర్ ఐక్య వేదిక నాయకులు

వరంగల్ రూరల్ : ఖిలావరంగల్ మండలం పరిధిలోని వరంగల్ ఆర్‌టీఏ జంక్షన్‌లో అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ ఐక్య వేదిక అధ్యక్షుడు ఎర్ర విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గద్దల కుమారస్వామి మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపీకి మెమోరాండం సమర్పించారు. అలాగే ఖమ్మంరోడ్ లోని బెస్తంచెరువులోని సర్వే నెంబర్ 241లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి, ప్రభుత్వ నిధులతో అంబేద్కర్ భవన్‌ను నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించిన వారిలో అంబేడ్కర్ ఐక్యవేదిక నాయకులు, మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చింత ప్రకాష్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు మన్నె బాబురావు, ఎస్సీ, ఎస్టీ సెల్ సమాఖ్య అధ్యక్షులు గబ్బెట బాబు, బీఆర్‌ఎస్ 43వ డివిజన్ అధ్యక్షుడు స్పందన్, ఖిలా వరంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డేపల్లి ప్రకాష్, నాయకులు డానియేల్, భాస్కర్, జగపతి ,కుమారస్వామి,భిక్షపతి, వీరస్వామి తదితరులు ఉన్నారు. అనంతరం అంబేడ్కర్ ఐక్య వేదిక నాయకులు కుడా చైర్మన్ సుందర్‌రాజు, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్యకు మెమోరాండం సమర్పించారు.

తూర్పులో అభివృద్ధి శూన్యం

- మాజీ మంత్రి కొండా సురేఖ

కాశిబుగ్గ : వరంగల్ తూర్పు నియోజకవర్గం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్దే తప్ప ఇప్పుడు అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. 6వ రోజు మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర 19వ డివిజన్ కాశిబుగ్గలో కొనసాగింది. ముందుగు సురేఖ కాశిబుగ్గ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి యాత్ర ప్రారంభించారు. అనంతరం పలు షాపుల యజమానులను, స్థానికులను పలకరిస్తూ సమస్యలను తెలుసుకుంటు తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెపుతూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తూర్పు బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతూ అడ్డొచ్చిన వారిపై అన్యాయంగా కేసులు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో తూర్పున ఎగిరేది కాంగ్రెస్ జెండా అని అన్నారు. మీసాల ప్రకాష్, రమేష్, రాజేష్, సదానందం, రవీందర్, లాజర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ

ఫ్లెక్సీల తొలగింపుపై సురేఖ ఆగ్రహం

హాథ్‌సే హాథ్ జోడో యాత్ర సందర్భంగా కాశిబుగ్గ జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని ఆధికార పార్టీ నాయకుల ఒత్తిడితో జీడబ్ల్యూఎంసీ ఆధికారులు తొలగించారని సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలి



బీమా పాలసీకార్డును పంపిణీ చేస్తున్న రావు పద్మ

కాజీపేట రూరల్ : కేంద్రంలో ప్రధాని మోదీ నిరుపేదలకు కోసం ప్రవేశపెట్టిన తపాలాబీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలని హన్మకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట విష్ణుపురి వాటర్‌ట్యాంక్ ఎదుట మంగళవారం మాజీ కార్పొరేటర్ బీజేపీ నాయకుడు గుంటి కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రమాదబీమా పాలసీ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడి పాలసీ కార్డులను పంపిణీ చేశారు. గుంటి కుమారస్వామి మాట్లాడుతూ రూ.396తో రూ.10 లక్షల బీమా పాలసీని అర్హులైన దాదాపు 100కు పైగా నిరుపేదలకు చేయించినట్లు తెలిపారు. పాలసీ శిబిరానికి సహకరించిన పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రభాకర్, స్టాఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట 63వ డివిజన్ ప్రెసిడెంట్ కరుణాకర్, కుమార్‌యాదవ్, హరి, కె.చంద్రశేఖర్, సుంచు వేణు, ఎండీ.ఇర్ఫాన్, జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి దుర్మరణం

- అతివేగం..మద్యం మత్తు కారణమా?
- సీతారాంపూర్ శివారులో ఘటన

పరకాల: పనికి వెళ్లొస్తున్న కూలీల బైక్‌ను ఎదురుగా వస్తున్న పల్సర్‌బైక్ వేగంగా ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే చనిపోగా, మరో ముగ్గరికి గాయాలయ్యాయి. ఈ ఘటన పరకాల మండలం సీతారాంపూర్ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పల్సర్‌బైక్‌పై వస్తున్న వారు మద్యం మత్తులో ఉండడంతోపాటు అతివేగం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. పరకాల పట్టణంలోని సీఎస్‌ఐ కాలనీకి చెందిన చుక్క రాజు (48)తోపాటు చింతల సురేష్, పోతిరెడ్డి బాబు హసన్‌పర్తిలో సెంట్రింగ్ పనికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నారు. హనుకొండ మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన జంగా వంశీ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు ములుగు గణపురంలోని సమీప బంధువు అంత్యక్రియలకు హాజరై పల్సర్‌బైక్‌పై వస్తున్నారు. పనికోసం వెళ్లి వస్తున్న రాజు మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకుంటాడు. ఈ క్రమంలో సీతారాంపూర్ శివారులోకి రాగానే చుక్క రాజు నడుపుతున్న బైక్‌ను.. జంగా వంశీ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. రెండు బైక్‌లపై ఉన్న ఆరుగురు రోడ్డుపై పడ్డారు. వారిలో చుక్క రాజుకు తీవ్రగాయాలయ్యాయి. ఇతని బైక్‌పై మరో ఇద్దరికి తీవ్ర, వంశీ బైక్‌పై ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలియగానే సీతారాంపూర్ గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.పరకాల సీఐ పుల్యాల కిషన్ సిబ్బందితో చేరుకొని తీవ్రగాయాలతో పడిపోయి ఉన్న చుక్క రాజును బతికించేందుకు చాతిపై సీపీఆర్ చేశారు. అనంతరం క్షతగాత్రులను పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చుక్క రాజు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రగాయాలైన వారిలో చింతల సురేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల రాకతో వంశీ భయపడి ఆస్పత్రినుంచి పారిపోయాడు. పరకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో వంశీతోపాటు మరో ఇద్దరు మద్యం మత్తులో ఉన్నట్లు అక్కడున్న వారు తెలిపారు.



రాజు (ఫైల్)